క్లుప్తంగా

ఎంపీ సత్యవతికి సత్కారం



ఎంపీ సత్యవతిని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక(అనకాపల్లి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నాగులాపల్లి చంద్ర శేఖర్ మహాస్వామి పిరమిడ్ వద్ద అనకాపల్లి ఎంపీ సత్యవతిని సత్కరించారు. జ్ఞాన గురువు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ



టోర్నీ ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోటవురట్ల : కైలాసపట్నంలో శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ టోర్నీని వైఎస్సార్ సీపీ నాయకులు సత్యనారాయణరాజు, డీవీ యువసేన గౌరవ అధ్యక్షుడు రాజగోపాలరాజు బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. ఈ టోర్నీని తిలకించేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ గ్రామ ఐక్యతకు గ్రామ దేవతల ఉత్సవాలు దోహదపడతాయన్నారు. యువతలో ఇలాంటి క్రీడా పోటీలు మరింత స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం కైట్స్ విద్యా సంస్థలో బుధవారం ఫేర్‌వెల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, ప్రిన్సిపాల్ అప్పలనాయుడులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రెడ్డి గణేష్, ఆడారి సన్యాసిరావు, అడిగర్ల శంకరరావు, విల్లూరి ప్రసాద్, సరిసా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల వితరణ



కూరగాయలు, బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాక(అనకాపల్లి): కుమారుని పుట్టిన రోజు పురస్కరించుకుని నిరుపేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. మునగపాక మండల కేంద్రంలో ఆడారి దానకర్ణ, పావని దంపతుల కుమారుడైన ధృవ పుట్టిన రోజుని పురస్కరించుకొని బుధవారం 150 మంది పేదలకు బియ్యం, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు, టమోటాలు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు



దిమిలిలో హోలీ సంబరాలు

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దిమిలి గ్రామంలో స్థానిక యువత హోలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగులు పూసుకుంటూ యువతీయువకులు, చిన్నారులు నృత్యాలు చేశారు. వళ్లంతా రంగులతో వీధుల్లో సందడిగా తిరిగారు. చిన్నారులు మరింత ఉత్సాహంగా పాల్గొన్నారు. రాంబిల్లి, పంచదార్ల, లాలంకోడూరు, వాడనర్సాపురం, హరిపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో హోలీ పండగను ఘనంగా చేసుకున్నారు.

జగనన్న పాలనలో మహిళలే మహారాణులు

ఆడాళ్లూ.. మీకు జోహార్లు.. ఓపిక, ఒద్దిక మీ పేర్లు.. మీరు ఒకరి కంటే ఒకరు గొప్పోళ్లు.. అన్నాడు మనసు కవి ఆచార్య ఆత్రేయ. ముళ్లపూడి వారైతే.. ఆడా మగా సమానమే కాకపోతే మగాళ్లు కాస్త ఎక్కువ సమానం అన్నారు. ఆకాశంలో సగం.. వినేందుకు బాగానే ఉంటుంది.. కానీ ఆచరణలో ఎన్నిమైళ్ల దూరమో..! మన రాష్ట్రంలో మాత్రం ఆడాళ్లే కాస్త ఎక్కువ సమానమంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎందుకంటే జగనన్న పాలనలో రాజకీయాల్లో సగం సీట్లు మహిళలకే కేటాయించారు. జనరల్ కేటగిరీలో కూడా మహిళలు పోటీపడొచ్చు. దీంతో ఇక్కడ మగాళ్ల కంటే మహిళలే ముందంజలో ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఊరూవాడా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

- ఊరూరా వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో ప్రతిభగల మహిళలకు సన్మానాలు

నక్కపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోను, పార్టీలోకూడా మహిళలకు సముచిత స్థానం కల్పించారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం నక్కపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, మాజీ సర్పంచ్ తుమ్మా కల్పనలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, కాసులమ్మలు మాట్లాడుతూ పురుషులతో సమానంగా రాజ్యాంగ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగనన్నదేని కొనియాడారు. జగనన్న పాలనలో మహిళలే మహారాణులన్నారు. మారుమూల గ్రామంలో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన తాను జెడ్పీటీసీ సభ్యురాలిగా, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఏనుగుపల్లి రత్నం ఎంపీపీగా పదవులు దక్కించుకున్నామంటే జగనన్న దయవల్లేనని కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు మహిళలకు కేటాయించి మహిళా పక్షపాతిగా జగనన్న చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. రాజ్యాంగ పదవులతోపాటు, పార్టీ పదవులు, అనుబంధ విభాగాల పదవుల్లో కూడా మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. దివంగత మహానేత వైఎస్సార్ కూడా మహిళను హోంమంత్రిని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో జగనన్న కూడా మహిళకే హోంమంత్రిగా అవకాశం కల్పించారన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, కాపునేస్తం, రేషన్‌కార్డులు, చివరకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కూడా మహిళల పేరునే మంజూరు చేస్తున్నారని తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలోవైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, తళ్ల భార్గవ్, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు, వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, స్థానిక నాయకులు ఎల్లేటి సత్యనారాయణ, వెదుళ్ల పాపారావు, బంగారురాజు, ముద్దా శ్రీను, వీసం రాజు పాల్గొన్నారు.



మహిళా ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం



కోటవురట్లలో విజేతకు బహుమతి అందిస్తున్న ఏపీఎం



సైతారుపేట పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



డ్వాక్రా మహిళల సమావేశంలో మాట్లాడుతున్న మండల లీగల్ ప్యానల్ అడ్వకేట్స్

సమాజంలో మహిళల పాత్ర కీలకం

యలమంచిలి : సమాజంలో మహిళల పాత్ర కీలకమైనదని మండల లీగల్ ప్యానల్ అడ్వకేట్ కోట్ని దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం యలమంచిలి మండలం లైనుకొత్తూరు మహిళా సమాఖ్య భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల లీగల్ ప్యానల్ అడ్వకేట్స్ బృందం సభ్యులు ముఖ్య అతిథులుగా విచ్చేసి సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను మహిళలు ఏ విధంగా ఆదిగమించాలో వివరించారు. మహిళలు పురుషులతో సమానంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. మహిళలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. అడ్వకేట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులుగా రాణించాలని, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్నారు. అడ్వకేట్ కశిరెడ్డి అప్పలస్వామినాయుడు మాట్లాడుతూ మహిళలకు ఉచిత న్యాయ సహాయాన్ని న్యాయస్థానాలు అందిస్తున్నాయని, వాటితో తమపై జరిగే దాడుల్ని ఎదుర్కోవాలని సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యలమంచిలి కోర్టులో విధులు నిర్వహిస్తున్న నిర్మలను వెలుగు ఏపీఎం రాణి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు సన్మానించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చెయిర్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల లీగల్ ప్యానల్ అడ్వకేట్స్ టి.నూకరాజు, సీఈలు బైపా గడ్డియ్య, రాయి తాతాజీ, వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో మహిళా దినోత్సవం కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్వసిద్ధి, సైతారుపేట స్కూళ్ల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి బేటీ బచావో బేటీ పడావో అంటూ నినాదాలు చేశారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యులు శక్తి ప్రియ, వాసంతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సమాజంలో మహిళల హక్కులు, సవాళ్లను వివరించారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా రాజ్యాంగ హక్కులు ప్రకారం మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. హెల్త్ క్లస్టర్ విజిటర్ సీహెచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏపీఎం రమణకుమారి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేసి, వారిని ఘనంగా సత్కరించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే దేశ ప్రగతి సాధ్యపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రతి విషయంలోనూ పెద్ద పీట వేసి, వారికి అడుగడుగునా అండగా నిలుస్తోందని కొనియాడారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాంబిల్లిలో ఆర్‌వైడీఎస్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ వర్క్‌లో సేవలందిస్తున్న వై.లావణ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైడీఎస్ కార్యదర్శి ఎస్.నూకరాజు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి కె.అప్పారావు, జగన్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా నాయకులు
- ఊరూరా తిరిగి పట్టభద్రుల ఓటర్లకు అభ్యర్థన

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా నక్కపల్లి మండలంలో బుధవారం ప్రచారం హోరెత్తింది. డీఎల్‌పురం వేంపాడు, నెల్లిపూడి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పట్టభద్రులను కలిసి సుధాకర్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రాంత సమస్యల పట్ల అవగాహన ఉన్న సుధాకర్‌కు ఓటు వేయడం ద్వారా చట్టసభల్లో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. విద్యావంతులను చట్టసభలకు పంపించాలన్నారు. నమూనా బ్యాలెట్‌ను ఆయన ఓటర్లకు చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిల్లాడ కృష్ణ, ఎంపీటీసీ లొడగల చంద్రరావు, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, గొర్ల బాబూరావు బొల్లం బాబ్జి, శేషారత్నం, సూరా కాసుల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మద్దతు కోరిన వీసం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ పలువురు ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందిని కోరారు. బుధవారం ఆయన డొంకాడ, రమణయ్యపేట, దోసలపాడు, చీడిక తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. సమస్యలపై అవగాహన ఉన్న సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, మండలపార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు చందిన కొండలరావు, కర్రి శ్రీను, తళ్ల భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, సురేష్‌వర్మ, ఎంపీటీసీలు పక్కుర్తి రమణ, గంటా తిరుపతిరావు, కాసుబాబు, గొర్ల గోవిందు, వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, ట్రేడ్ యూనియన్ నాయకుడు కాకర వెంకటరావు, వీర్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



డీఎల్‌పురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



చినగుమ్ములూరులో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి



రేబాకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వీసం తదితరులు

ఎస్.రాయవరం : మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతిచ్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్లను ఓటు అభ్యర్థించారు. చినగుమ్మలూరు గ్రామంలో జెడ్పీటీసీ కాకర దేవి, వేమగిరి, సైతారుపేట, సర్వసిద్ధి, జేవీ పాలెం గ్రామాల్లో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు, పెదగుమ్ములూరులో వెలగా శ్రీనివాసరావు తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెంట్రెడ్డి గోవిందు, కాసెపు అప్పన్న, సిగిరెడ్డి అప్పారావు, వేమగిరి సర్పంచ్ అబ్బాయిదొర, ఎస్.రాయవరం ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలంటూ స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం ప్రచారం చేశారు. సర్పంచ్ చేపల సుభాషిణి స్థానికులతో సమావేశమై వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు చేపల వెంకటరమణ, సూరాడ ధనరాజు, ఉప సర్పంచ్ గంగిరి లక్ష్మి, రవి పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఈ నెల 13న జరగబోయే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు విజయానికి పార్టీ నాయకులు బుధవారం పట్టణంలోని వార్డుల్లో ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యతా ఓటును సుధాకర్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఓటర్లకు వివరించారు. ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ జిల్లా పబ్లిక్ విభాగం లింక్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ గార ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, నాయకులు నెలపర్తి నాగరాజు పాల్గొన్నారు.

స్వయంభూ గణపతి ఆలయ ప్రారంభం

ఎస్.రాయవరం : నర్సీపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని చినగుమ్ములూరులో పునర్నిర్మించిన సయంభూ విఘ్నేశ్వరాలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయం గోడలపై నృత్య, హేరంబ, విష్ణు గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా యాగశాల ఏర్పాటుచేసి శాంతి హోమం, స్వయంభూ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల విరాళాలతో నిర్మించిన ఆలయాన్ని రైలు ప్రయాణికులకు, గ్రామస్తులకు అనువుగా మార్చారు. ఆలయానికి ఆనుకుని ఉన్న కోనేటిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఇదే ప్రాంతంలో కాశీ విశ్వేశ్వరస్వామి, నవగ్రహాల ఆలయాలు ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు చేసిన కోలాటం ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.



పునర్నిర్మాణం తర్వాత ప్రారంభించిన స్వయంభూ గణపతి ఆలయం

ట్రినిటీ ఆస్పత్రి సేవలు అభినందనీయం

కోటవురట్ల : బి.కె.పల్లిలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, సర్పంచ్ లింగం నాయుడు ప్రారంభించారు. కాకినాడకు చెందిన ట్రినిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో డైరెక్టర్లు రిక్కీ గూటం, కిషోర్‌ల పర్యవేక్షణలో జరిగిన శిబిరానికి సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు హాజరయ్యారు. వారికి ప్రముఖ వైద్యులు మురళీకృష్ణ, భరత్, బాలు, అమీనా షేక్ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. ఎంపీటీసీ రాంబాబు, సర్పంచు లింగంనాయుడు మాట్లాడుతూ పల్లెల్లో ప్రముఖ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ బి.సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న ట్రినిటీ ఆస్పత్రి వైద్యులు

ప్రభుత్వ ఆస్తుల తాకట్టు సరికాదు

పాయకరావుపేట : ప్రజల సొమ్ముతో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఆస్తుల్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడం సరికాదని కాంగ్రెస్ నాయకులు బీజేపీ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన బుధవారం ర్యాలీ నిర్వహించారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం స్టేట్ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గారా సూర్యారావు, పార్టీ నాయకులు పి.అప్పలరాజు, కె.సత్యనారాయణ, ఎస్ఎస్‌వీ సత్యనారాయణ, శ్రీనివాస్, సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

స్నేహితుల ఔదార్యం

యలమంచిలి : తమతో పాటు చదువుకున్న స్నేహితుడు మరణించడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి పెద్ద మనసు చాటుకున్నారు ఆ విద్యార్థులు. యలమంచిలి పట్టణంలో తులసీనగర్‌కు చెందిన బొల్లోజు వెంకటప్రసాద్ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. అతనితో చదువుకున్న 1986 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆ కుటుంబానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి చేతుల మీదుగా రూ.లక్షా 13 వేలు ఆర్థిక సాయం అందించారు. మిత్రుని పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి గణపతిరావు, కర్రి శ్రీనివాసరావు, సుందరపు బాబ్జీ, అంగా శివాజీ, రమేష్, రంగా రవి, యల్లపు రామనాథం తదితరులు పాల్గొన్నారు.



పిళ్లా రమాకుమారి చేతుల మీదుగా స్నేహితుడి కుటుంబానికి సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రకృతి వనరుల సేవా కేంద్రం ప్రారంభం

రావికమతం: దొండపూడిలో ప్రకృతి వనరుల సేవా కేంద్రాన్ని ఆ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఆర్.వి.ఎస్ స్వామినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవ ధాన్యాల సాగు విధానంపై పలు సూచనలు చేశారు. ఎండా కాలంలో భూమిని బీడుగా ఉంచకుండా పీఎండీఎస్ వేసి సారవంతం చేసుకోవాలన్నారు. 30 రకాల విత్తనాలతో 12 కేజీల మొత్తాన్ని ఎకరా భూమిలో వేసుకోవాలన్నారు. విత్తన గుళికలు, బీజామృతం, జల్లెడపట్టిన ఎర్రమట్టి, జల్లించిన కర్రబూడిద తయారీ గురించి వివరించారు. మాజీ సర్పంచ్ గర్రెడ్డి తాతబాబు, ఉప సర్పంచ్ రాజారావు, నాయకులు రామునాయుడు, రాము పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో వనరుల సేవా కేంద్రం డీపీఎం స్వామినాయుడు

21న కొత్త అమావాస్య జాతర

నర్సీపట్నం: పట్టణంలో నూకాలమ్మ జాతరకు తగిన ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 17, 20 తేదీల్లో అమ్మ జాగరణ ఉంటుందన్నారు. 21న కొత్త అమావాస్య పండగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, ఆలయ కార్యనిర్వాహణాధికారి సాంబశివరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం



విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్సపొందుతున్న ఆరుగురు విద్యార్థులను బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. ఆటో బోల్తాపడి మాకవరం గ్రామ విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాద ఘటనపై మంత్రి అమర్‌నాథ్ ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐటీ విభాగం అధ్యక్షుడికి అభినందన

నక్కపల్లి : అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కాగిత సర్పంచ్ పోతం శెట్టి రాజేష్‌ను పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అభినందించారు. బుధవారం ఎమ్మెల్యే బాబూరావును క్యాంపు కార్యాలయంలో రాజేష్ కలిశారు. తనను ఐటీ విభాగం అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే బాబూరావు సూచించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సూరాకాసుల గోవిందు, శీరం నర్సింహమూర్తి, గొర్లబాబూరావు, శేషారత్నం పాల్గొన్నారు.



రాజేష్‌కు స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తీర్ణత



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం అనురాధ

కె.కోటపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదవాలని ఎ.కోడూరు హైస్కూల్ హెచ్‌ఎం అనురాధ తెలిపారు. ఎ.కోడూరు సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ 36 మంది విద్యార్థులు 25 రోజులపాటు ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా మానసిక ప్రశాంతతో పరీక్షలను రాయడం వల్ల మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. సమీకృత వసతి గృహాధికారులు పి.గంగునాయుడు, రమేష్, ఉపాధ్యాయులు మాధవి, బేగం, గోవింద్, పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.